ప్రజల మదినిండా బీఆర్ఎస్సే

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ముస్తాబాద్, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాల కార్యకర్తల సమావేశం

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): ప్రజల మదినిండా బీఆర్ఎస్ పార్టీ ఉన్నదని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. మనకోసం కొట్లాడే వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన ముస్తాబాద్, గంభీరావుపేట, తంగళ్లపల్లి క్లస్టర్ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఓటరును కలిసి కేసీఆర్ పాలన, కాంగ్రెస్ పాలనపై వివరించి ఓటు అడగాలని సూచించారు. కాంగ్రెస్ పనితీరుపై ప్రజలు విసుగెత్తిపోయారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బోయినపల్లి వినోద్‌కుమార్ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం నుంచి సాధించిన నిధుల్లో విశేషపాత్ర పోషించారని తెలిపారు. అలాంటి మేధావిని పార్లమెంట్‌కు పంపడం ద్వారా రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. విద్వేషం పేరుతో రాజకీయం చేసే వారికి ఓటు వేస్తే అభివృద్ధి స్థానంలో విధ్వంసం జరుగుతుందన్నారు. ప్రజలు చైతన్య వంతులు. కాంగ్రెస్ బీజేపీ చేస్తున్న ములాఖత్ రాజకీయాలను గమనిస్తున్నారన్నారు. వినోద్‌కుమార్ లాంటి సీనియర్ నేతను గెలిపించుకోవాలన్న ఆలోచనలో ప్రజలున్నారని చెప్పారు. ఎంపీ ఎన్నికల ప్రచారం కోసం వచ్చేనెల 10న కేసీఆర్ సిరిసిల్ల రోడ్ షోకు అన్ని మండలాల నుంచి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, పార్టీ సీనియర్ నాయకులు చీటి నర్సింగరావు, గూడూరి ప్రవీణ్, ముస్తాబాద్ ఎంపీపీలు జనగామ శరత్‌రావు, పడిగెల మానస, వంగ కరుణ, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు, మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, కల్వకుంట్ల గోపాల్‌రావు, మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, అక్కరాజు శ్రీనివాస్, గజభీంకార్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో ముస్తాబాద్, తంగళ్లపల్లి, గంభీరావుపేట మండలాల కార్యకర్తలకు పార్లమెంటు ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తున్న కేటీఆర్

కమిషనర్ పర్యటనతో కదిలిన యంత్రాంగం

- రాజన్న కోడెల సంరక్షణకు ముమ్మర చర్యలు
- 8 మంది వైద్యులు 15 మంది సిబ్బందితో కోడెలు, ఆవులకు వైద్య పరీక్షలు

గోశాలను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న పశుసంవర్ధకశాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీమతి మంజువాణి

వేములవాడ టౌన్, ఏప్రిల్ 23 : రాజన్న గోశాల కోడెల సంరక్షణకు అధికారులు చర్యలు మొదలుపెట్టారు. వేములవాడ రాజన్న కోడెల, గోవుల సంరక్షణ ధ్యేయంతో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎం హనుమంతరావు మంగళవారం ఆకస్మికంగా పర్యటించిన సంగతి తెలిసిందే. కోడెల దయనీయ పరిస్థితిని చూసి చలించిన ఆయన ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేసి, చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఆలయ అధికార యంత్రాంగం రాజన్న కోడెలు, ఆవుల సంరక్షణ చర్యలకు ఉపక్రమించింది. కమిషనర్ హనుమంతరావు ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి శైలజారామయ్యార్ నివేదిక అందించారు. గురువారం ఉదయమే పశువైద్య, పశుసంవర్ధకశాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీమతి మంజువాణి స్వయంగా వేములవాడకు చేరుకుని, గోశాల పరిస్థితిని పరిశీలించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కొమురయ్య, సంబంధిత పశుసంవర్ధక వైద్య బృందం, దేవాదాయశాఖ ఉన్నతాధికారి కృష్ణవేణి, ఈవో కృష్ణప్రసాద్‌తో పాటు యంత్రాంగం, పశువైద్య, పశుసంవర్ధకశాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీమతి మంజువాణి ఆధ్వర్యంలో కోడెల గోశాలకు చేరుకుని అవసరమైన చర్యల్లో నిమగ్నమయ్యారు. గోశాలలోగల 1093 కోడెలకు 8 మంది వైద్యులు, 15 మంది సిబ్బంది సహకారంతో వ్యాక్సినేషన్ చేశారు. వివిధ రకాల రుగ్మతలతో బాధపడుతున్న వాటికి అవసరమైన వైద్యం, ఆహారం, సౌకర్యాలు అందిస్తున్నారు. నెలరోజులకు ఒకసారి ఆలయ గోశాలలో వైద్య శిబిరం నిర్వహిస్తామని మంజువాణి తెలిపారు.

బీఆర్ఎస్‌పై అభిమానం

- వినోద్ ఎన్నికల ఖర్చు కోసం ₹5వేలు అందజేత
- కృష్ణమూర్తిని అభినందించిన కేటీఆర్

కేటీఆర్ సమక్షంలో ఎంపీ అభ్యర్థి వినోద్‌కు రూ.5వేల చెక్కు అందిస్తున్న కార్యకర్త కృష్ణమూర్తి యాదవ్

గంభీరావుపేట, ఏప్రిల్ 25: ముస్తాఫానగర్‌కు చెందిన గులాబీ కార్యకర్త మారవేని కృష్ణమూర్తి యాదవ్ బీఆర్ఎస్ పార్టీపై అభిమానం చాటుకున్నారు. గురువారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన గంభీరావుపేట మండల కార్యకర్తల సన్నాహక సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఎన్నికల ఖర్చు కోసం తన వంతుగా ₹5వేల చెక్కును అందించారు. దీంతో ఆయనను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్ షో సక్సెస్

- కోనరావుపేటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షోకు తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు

కోనరావుపేట, ఏప్రిల్ 25: కోనరావుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం నిర్వహించిన కేటీఆర్ రోడ్‌షో సక్సెస్ అయ్యింది. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కేటీఆర్ స్పీచ్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది. ఇక్కడ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, జడ్పీ చైర్పర్సన్ న్యాలకొండ అరుణ, వేములవాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రోడ్‌షోలో బతుకమ్మ ఆడుతున్నమహిళలు

కోనరావుపేట మండల కేంద్రంలోని రోడ్ షోకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన ప్రజలు

ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లు కీలకం

- అదనపు కలెక్టర్ రెవెన్యూ భీమ్యానాయక్
- మైక్రో అబ్జర్వలకు శిక్షణ కార్యక్రమం

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

కలెక్టరేట్, ఏప్రిల్ 25: పోలింగ్ రోజున స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటింగ్ జరగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని అదనపు కలెక్టర్ రెవెన్యూ భీమ్యా నాయక్ అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ రోజుల్లో పోలింగ్ కేంద్రాన్ని నిశితంగా పరిశీలించి, ఎన్నికలు తీరును పర్యవేక్షించి, ఆ నివేదికను ఎన్నికల సాధారణ పరిశీలకులకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతోందా లేదా, తదితర విషయాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో వేములవాడ ఏఆర్వో రాజేశ్వర్, సీపీవో పీబీ శ్రీనివాసచారి, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జునరావు, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అదనపు కలెక్టర్ అభినందన

ఉత్తమ ఫలితాలు సాధించిన కేజీబీవీ విద్యార్థులను అభినందిస్తున్న అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

కలెక్టరేట్, ఏప్రిల్ 25: ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన కేజీబీవీ విద్యార్థులను అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ అభినందించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్లో అభినందించి, ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఇక్కడ డీఈవో రమేశ్‌కుమార్, సెక్టోరల్ అధికారి పద్మజ, కేజీబీవీ పాఠశాలల స్పెషల్ ఆఫీసర్లు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

బోయినపల్లి, ఏప్రిల్ 25: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని అడిషనల్ కలెక్టర్ భీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం బోయినపల్లి మండలం కొదురుపాక విలాసాగర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు వచ్చిన ధాన్యం ఎంత, ఎన్ని క్వింటాళ్లు కొనుగోలు చేశారు. ఎన్ని క్వింటాళ్లు మిల్లులకు తరలించారనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేయాలని కోరారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ పుష్పలత ఉన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

ముస్తాబాద్, ఏప్రిల్ 25 : ఎండలు అధికమైనందున మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు ఈ పంచాయతీ ఆపరేటర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి జిల్లా పంచాయతీ అధికారి హాజరై పలు విషయాలపై సిబ్బందికి వివరించారు. గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి లేకుండా చూడాలని పచ్చదనం పరిశుభ్రతపై ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తూ సిబ్బందితో పనులు చేయించాలన్నారు. ఇక్కడ ఎంపీడీవో భాస్కర్ శర్మ, డీఎల్పీవో మల్లికార్జున్, ఏపీవో ఆనంద్‌మోహన్, కార్యదర్శులు, ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

డీజే నిర్వాహకుడిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25: వెంకటాపూర్‌లో సిరిసిల్లకు చెందిన వంగరి సుధాకర్ అనే డీజే నిర్వాహకుడు ప్రజలకు ఇబ్బందులు కలిగేలా పెద్ద శబ్దంతో డీజే సౌండ్ పెట్టి డ్యాన్సులు చేయడానికి కారణమైనందున కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. అలాగే డీజే ఆపరేటర్ అంకెన మహేశ్‌పై కూడా కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. రోడ్లపై వరిధాన్యం ఎండబోయడం వల్ల రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్నందున రోడ్డు వరిధాన్యం ఎండబోస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చెప్పారు.

రథోత్సవం.. రమణీయం

రథోత్సవంపై నుంచి భక్తులకు దర్శనమిస్తున్న స్వామి వారు

గంభీరావుపేట, ఏప్రిల్ 25 : మండల కేంద్రంలోని శ్రీ సీతారామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి రథోత్సవం నిర్వహించారు. హోమం, బలిహరణం, రథబలి అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఐదంతస్తుల రథంపై పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని కట్న కానుకలు సమర్పించుకున్నారు. స్వామి వారి రథాన్ని లాగుతూ గోవిందా అంటూ భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

ముస్తాబాద్, ఏప్రిల్ 25 : మండలంలోని చీకోడ్ గ్రామానికి చెందిన బన్నాజీపేట కనకవ్వ (46) బైక్‌పై కిందపడగా మృతి చెందిం ది. బంధువులు తెలిపిన ప్రకారం, నారాయణరావుపేట్ మండ లం మాచాపూర్‌లోని బంధువులు ఇంటికి గురువారం వెళ్లి తిరిగి స్వగ్రామం చీకోడుకు భర్త చంద్రయ్య బైక్‌పై వస్తుండగా కిందపడింది. తీవ్ర గాయాలైన కనకవ్వను సిద్దిపేట దవాఖానకు తరలించగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. కనకవ్వకు కుమారుడు కుమార్తె ఉన్నారు.

ఉపాధి పనులతో దీర్ఘకాలిక ప్రయోజనాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25 : ఉపాధి హామీ పనులతో గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలున్నాయని డీఆర్డీవో శేషాద్రి తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఈజీఎస్ పనుల పురోగతిని పరిశీలించి మా ట్లాడారు. గ్రామాల్లో చేపట్టిన ఖండితకందకాలు, ఫాంపాండ్లు, చెరువుల్లో పూడికతీత పనులతో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. హరిదాస్‌నగర్, రాగట్లపల్లిలో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించి వంద పనిదినాలను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్త య్య, ఏపీవో కొంరయ్య, ఎంపీవో వజీర్ అహ్మద్, ఈసీ, టీఏ, తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన ఓపెన్ పరీక్షలు

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 25 : ఓపెన్ ఇంట ర్, పది వార్షిక పరీక్షలు గురువారం ప్ర శాంతంగా ప్రారంభమైనట్లు డీఈవో రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా వ్యాప్తం గా మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా మొదటి రోజు పరీక్షలకు 817 మంది విద్యార్థులకు 720 మంది విద్యార్థులు హాజరయ్యారు. 97 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు. ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

ప్రమాదంలో రిటైర్డ్ హెచ్ఎం మృతి

రాంరెడ్డి (ఫైల్)

కోనరావుపేట, ఏప్రిల్ 25: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కొమ్మిడి రాంరెడ్డి (66) ఉపాధ్యాయులతో కలిసి తీర్థ యాత్రలకు వెళ్లారు. ఈక్రమంలో అరుణాచలంలో దర్శనానికి వెళ్తుండగా బస్సు దిగే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు కాలు జారి బస్సు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈక్రమంలో రాంరెడ్డి మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి గురువారం ఇంటికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య పుష్పలత, కుమారుడు వామన్, కూతురు ప్రసన్న ఉన్నారు.

పంటల దిగుబడిపై అధ్యయనం చేయాలి

- అర్థ గణాంక సంచాలకుడు దయానందం
- ప్లానింగ్, స్టాటిస్టికల్ అధికారులతో సమీక్ష

మాట్లాడుతున్న అర్థగణాంక శాఖ సంచాలకులు జీ దయానందం

కలెక్టరేట్, ఏప్రిల్ 25 : జిల్లాలో పంటల దిగుబడులపై అధికారులు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని అర్థగణాంక శాఖ సంచాలకులు జీ దయానందం వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, భూగర్భజల, ప్లానింగ్, స్టాటిస్టికల్ అధికారులకు సూచించారు. ఈ మేరకు అర్థగణాంక సంచాలకులు జిల్లాలో పర్యటించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో జిల్లాలో పంటల సాగు తదితర అంశాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం సాగు పరిస్థితిపై, దిగుబడుల్లో వస్తున్న తేడాలపై వ్యవసాయ శాఖాధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా భూగర్భ జల నీటిమట్టం ఎంత మేరకు పడిపోయిందనే విషయాన్ని సంబంధిత భూగర్భజల శాఖాధికారులను అడిగారు. అనంతరం మండల ప్లానింగ్, స్టాటిస్టికల్ అధికారులు మండల స్థాయిలో నిర్వహిస్తున్న పనులపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అర్థగణాంక శాఖ సహాయ సంచాలకులు ఎంఆర్‌వీ రమణ, ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాసచారి, ఉప గణాంక అధికారులు, మండల ప్లానింగ్ స్టాటిస్టికల్ అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు, సలహాలకు పరిశీలకులను సంప్రదించండి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, ఏప్రిల్ 25 : కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల సాధారణ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని కరీంనగర్ చొప్పదండి, మానకొండూరు, సిరిసిల్ల, వేములవాడ, హుజూరాబాద్, హుస్నాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సూచనలు, సలహాల కోసం ఎన్నికల సాధారణ పరిశీలకులు, ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా ఫోన్ నంబర్ 91774 35833కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో 42 మండలాలు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోకి వస్తాయని చెప్పారు. కరీంనగర్‌లోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. ఎవరైనా ఫిర్యాదు చేసే వారు స్వయంగా కానీ లేదా ఫోన్ ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అలాగే ఎన్నికల వ్యయ పరిశీలకులు అశ్వినీ కుమార్ పాండ్య ఫోన్ నంబర్ 9032659531కు ఎన్నికల వ్యయం సంబంధిత అంశాలపై ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు పరిశీలకులు జిల్లాలోనే ఉండి ఎన్నికల వ్యయానికి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తారని తెలిపారు. ఏదైనా ఫిర్యాదులు ఉంటే ఆయన దృష్టికి తీసుకు రావాలని కలెక్టర్ పేర్కొన్నారు. కరీంనగర్‌లోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎన్నికల వ్యయ పరిశీలకులు ప్రతిరోజూ సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎవరైనా ఫిర్యాదు చేసే వారు స్వయంగా కానీ లేదా ఫోన్ ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో వెల్లడించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 25 : ఆన్ లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ సంజీవ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రజలకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. గుర్తుతెలియని నంబర్ ద్వారా గాని ఏ ఇతర సమాచారం గాని వచ్చిన ఈ లింక్‌లపై క్లిక్ చేయవద్దన్నారు. లింక్ పేరుతో మోసాలకు పాల్పడే మూఠాలు ఎక్కువ అయ్యాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇక్కడ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి చూపి ఆత్మహత్యలు ఆపాలి

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 25: పవర్‌లూం కార్మికులకు ఉపాధి చూపి వరుస ఆత్మహత్యలు ఆపాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు అన్నారు. సిరిసిల్ల పద్మనగర్‌లోని ఆడిచర్ల సాయి (25) వార్పిన్ పరిశ్రమ కార్మికుడు ఇంట్లో ఉరేసుకొని చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆత్మహత్యకు పాల్పడ్డ సాయి, మల్లేశం కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేయో చెల్లించాలని కోరారు. నాలుగు నెలలుగా వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో ఉండడంతో అప్పుల బాధలతో పవర్‌లూం కార్మికులు వరుసగా ఐదుగురు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొనారు. తక్షణమే వారికి ఉపాధి చూపి ఆత్మహత్యలు ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యారన్ సబ్సిడీ, పెండింగ్ బకాయి బిల్లులు విడుదల చేసి నేతన్నలకు ఉపాధి చూపి ఆత్మహత్యలు ఆపాలని కోరారు. ఇక్కడ మూషం రమేశ్, కోడం రమణ, విమల, అశోక్, గణేశ్ తదితరులు ఉన్నారు.

మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 25 : మహనీయుల ఆశయాలు, వారి ఆలోచన విధానాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. సావనపెల్లి రాకేశ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆర్య వైశ్య భవన్‌లో గురువారం మహనీయుల జయంత్యుత్సవ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహనీయుల ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో బహుజన ఉపాధ్యాయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేశ్, మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జేసీ సెట్-2024 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 25 : మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఆర్‌జేసీ సీఈటీ-2024, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహించే డీజీ ఆర్‌డీసీ సీఈటీ-2024ను ఈనెల 28న నిర్వహిస్తున్నామని, రీజనల్ కోఆర్డినేటర్ గౌతంరెడ్డి తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లా కేంద్రాల్లో 25 పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాధికారి సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. కరీంనగర్‌లో 7, జగిత్యాలలో 8, పెద్దపల్లిలో 5, సిరిసిల్లలో 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షా సమయం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. హాల్ టికెట్లను https//:mjptbcwreis.telangan. gov.in వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని తెలిపారు.

లింగ నిర్ధారణపై జిల్లా అడ్వైజరీ సమావేశం

కలెక్టరేట్, ఏప్రిల్ 25 : జిల్లాలో లింగ నిర్ధారణపై అడ్వైజరీ కమిటీతో జిల్లా వైద్యాధికారి డా.సుమన్‌మోహన్‌రావు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. గురువారం డాక్టర్ సుమన్ మోహన్ రావు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి అధ్యక్షతన డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైసర్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఏ సుమన్ మోహన్ రావు మాట్లాడారు. అన్ని అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లు రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీలకు త్వరలో సమావేశం ఏర్పాటు చేసి వారికి కూడా అవగాహన కలిపించాలని సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో డీడీ ఎంహెచ్‌వో డాక్టర్ రజిత, డాక్టర్ వసంత్ రావు, డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ శోభారాణి, లీగల్ అడ్వైజర్ శాంతి ప్రకాశ్ శుక్ల, ఎన్‌జీవో ప్రెసిడెంట్ సీహెచ్.భాస్కర్, ఎన్‌జీవో ఝాన్సీ లక్ష్మి, డీపీవో ఉమా, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పైపులు, పశుగ్రాసం దగ్ధం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 25 : మండలంలోని వల్లంపట్ల గ్రామంలో గురువారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు 50 ఎకరాల్లో పశుగ్రాసం, పలువురు రైతుల పైపులు దగ్ధమయ్యాయని బాధిత రైతులు పేర్కొన్నారు. గ్రామంలో కరెంటు లేక పోవడంతో వ్యవసాయ పొలాల వద్ద నీటి సౌకర్యం లేకపోవడంతో రైతులు మంటలను ఆర్పలేక పోయారు. దాదాపు 30 మంది రైతులకు చెందిన పశు గ్రాసం, 9 మందికి చెందిన పైపులు దగ్ధమయ్యాయి. సిరిసిల్ల ఫైర్ సిబ్బంది చేరుకునే సరికే నష్టం జరిగిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

మున్నూరు కాపు సంఘం ఎన్నికల సన్నాహక సమావేశం

మున్నూరు కాపు నిత్య